క్లుప్తంగా

ఉత్సాహంగా వాక్‌థాన్



వాక్‌థాన్‌లో పాల్గొన్న కళాంజియ మహిళలు

మల్కాపురం: సామాజిక అంశం కార్యక్రమంలో భాగంగా మల్కాపురం కళాంజియ సమాఖ్య ఆధ్వర్యంలో 61వ వార్డు ప్రకాష్‌నగర్‌లో శనివారం నిర్వహించిన వాక్‌థాన్ ఉత్సాహంగా సాగింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా గాజువాక బ్రాంచి మేనేజర్ సుధీర్, వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ నుంచి రమాప్రభ,కళాంజియ వైజాగ్ రూరల్ రీజనల్ కో–ఆర్డినేటర్ కె.రామ్‌కుమార్, కోస్టల్ కో–ఆర్డినేటర్ ధనలక్ష్మి తదితరులు నేటి యువత ఎలా చెడిపోతున్నారు.. మాదకద్రవ్యాల నిర్మూలకు ప్రభుత్వాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై మాట్లాడారు.అనంతరం ర్యాలీ చేపట్టారు.

వ్యాకులమాత ఆలయానికి పాదయాత్రగా భక్తులు



మేరీమాత విగ్రహంతో పాదయాత్రగా వ్యాకులమాత ఆలయానికి వెళ్తున్న భక్తులు

గోపాలపట్నం: కొత్తవలస వద్ద ఉన్న వ్యాకుల మాత ఆలయానికి క్రీస్తు భక్తులు అధిక సంఖ్యలో పాదయాత్రగా బయుదేరి వెళ్లారు. గోపాలపట్నం ప్రాంతంలో క్రీస్తు భక్తుల కోసం మంచి నీరు, మజ్జిగ వంటివి అందించారు. మేరీ మాత విగ్రహాన్ని ఊరేగిస్తూ వెళ్లారు.

కేంద్ర పథకాలను వివరించాలి



మాట్లాడుతున్న మాధవ్

విశాఖ విద్య: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్. మాధవ్ అన్నారు. ఎన్‌ఏడీలోని ఆపార్టీ కార్యాలయంలో శనివారం పశ్చిమ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన మాధవ్ మాట్లాడుతూ త్వరలోనే జరగబోయే ఎన్నికలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలన్నారు. త్వరలో అసెంబ్లీల వారీగా ఎన్ని కల కార్యాలయాలు ప్రారంభించనున్నట్లు తెలి పారు. పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ దాడి పురుషోత్తం రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ పార్లమెంట్ కన్వీనర్ రామ్మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శులు దిలీప్ వర్మ, పాలిమేర శ్రీనివాసరావు, సేనాపతి మహేష్, కోకిలగేడ విజయ బాబు, జ్యోతి,స్వామినాయుడు పాల్గొన్నారు.

రైతులకు గుర్తింపు కార్డుల పంపిణీ



గుర్తుంపు కార్డులు అందిస్తున్న యాసిన్

కంచరపాలెం: కంచరపాలెం రైతుబజార్‌లో ఈవో శెట్టి కృష్ణమూర్తి నేతృత్వంలో శనివారం మార్కెటింగ్ శాఖ ఏడీ షేక్ యాసిన్ సుమారు 182 మంది రైతులకు గుర్తింపు కార్డులు అందించారు. రైతులు కార్డులను సక్రమంగా వినియోగించాలని ఆయన సూచించారు. ముందుగా రైతుబజారులో ఏర్పాటు చేస్తున్న కొత్త సీసీ కెమెరాలను యాసిన్ పరిశీలించారు. కెమెరాల నిఘాతో రైతు బజారులో దొంగతనాలను అరికట్టవచ్చన్నారు.

షిప్‌యార్డు ఉద్యోగుల సమస్యలపై వినతి



ఎంపీ జీవీఎల్ నరసింహారావుకు వినతిపత్రం అందజేసిన బీఎంఎస్ ప్రతినిధులు

సింధియా: షిప్‌యార్డ్‌లో పని చేస్తున్న కార్మికుల సమస్యలపై ఎంపీ జీవీఎల్ నరసింహారావుకు శనివారం షిప్‌యార్డ్ బీఎంఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఉద్యోగ భద్రత కోసం ఎదురు చూస్తున్న షిప్‌యార్డ్ ఎల్ అండ్ ఎం సీరిస్ ఉద్యోగులను పర్మినెంట్ చేసే విధంగా కృషి చేయాలని ఎంపీని కోరారు. సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తాన్నారు.



ప్రజలకు తగ్గిన వ్యయప్రయాసలు

సేవల్లో పారదర్శకతకు పెద్దపీట

సచివాలయాలకు సమకూరుతున్న పక్కా భవనాలు

నాడు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే మండల కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి వెళ్లినా అధికారులు అందుబాటులో లేకుంటే ఈసురోమని ఇంటిదారి పట్టాల్సిన దుస్థితి. కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగినా సకాలంలో పనులు కాని పరిస్థితి ఉండేది.

నేడు ఇంటికి సమీపంలో ఉన్న సచివాలయంలోనే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. ఏదైనా పని కోసం సచివాలయానికి వెళితే సిబ్బంది గౌరవంగా పలకరిస్తారు. వచ్చిన పనేంటో అడిగి వెను వెంటనే దరఖాస్తు ఆన్‌లైన్ చేస్తున్నారు. వలంటీర్‌తో పాటు సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చి సాయం అందిస్తున్నారు.

సేవాలయాలు



52వ వార్డు శాంతినగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్న సచివాలయాలు

విశాఖ విద్య: విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో వార్డు సచివాలయాల ద్వారా అందుతున్న సేవలను మరింత విస్తృతం చేయడంపై అధికారులు దృష్టి సారించారు. సచివాలయాల ద్వారా 530 రకాల సేవలు అందించాలనే ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. బుధవారం నుంచి స్థిరాస్తి లావాదేవీలు, రిజిస్ట్రేషన్ సైతం సచివాలయంలో జరిగేలా ఏర్పాట్లు చేశారు. పౌర సేవలు అందించడంలో సచివాలయాల ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని వీటికి మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నారు.

సచివాలయాలకు పక్కా భవనాలు

నియోజకవర్గం పరిధిలోని 14 వార్డుల్లో 69 సచివాలయాలు ఉన్నాయి. వీటిని కమ్యూనిటీ హాల్స్, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. కమ్యూనిటీ హాల్స్‌లో నిర్వహిస్తున్న సచివాలయాల్లో మౌలిక సౌకర్యాల కల్పించడంతో పాటు అవసరమైన చోట నూతన భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తున్నారు. 52వ వార్డు మద్రిపాలెం వుడా లే అవుట్‌లో సచివాలయ భవన నిర్మాణానికి రూ. 23 లక్షలు మంజూరు చేశారు. అదే విధంగా నేతాజీ నగర్‌లో నిర్వహిస్తున్న సచివాలయ భవనంపై రూ.13 లక్షలతో మరో అంతస్తు నిర్మించారు.

➡ శాంతినగర్ కమ్యూనిటీ హాల్‌లో రెండు సచివాలయాలు(1086311, 1086312) నిర్వహిస్తుండగా, ఇక్కడ రూ. 19 లక్షలతో మౌలిక సౌకర్యాలు పెంపొందించారు.



సచివాలయంలో కూర్చొనేందుకు వీలుగా ఏర్పాట్లు



శాంతినగర్ సచివాలయంలో వివరాలు సేకరిస్తున్న వీఆర్వో

పారదర్శకంగా సేవలు



వివిధ పనుల కోసం వచ్చిన వారి నుంచి దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్ చేస్తున్నాం. ట్రాకింగ్ సిస్టమ్‌తో జవాబుదారీ తనం పెరిగింది. లబ్ధిదారుల సెల్‌ఫోన్ నంబర్ నమోదు చేస్తున్నాం. దీంతో **సేవల వివరాలను** వారే స్వయంగా తెలుసుకునే **అవకాశం ఉంది.** ప్రజలకు సేవలు అందిస్తున్నామనే తృప్తి మిగులుతుంది.

– ఎస్. నాగేశ్వరరావు, సాకేతపురం–3 వార్డు సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి

ఇంటికే ఆరోగ్య శ్రీ కార్డు



నా ఫొటో లేకుండా ఆరోగ్య శ్రీ కార్డు వచ్చింది. కంటి ఆపరేషన్ చేయించుకుందామని ప్రైవేటు ఆస్పత్రికి వెళితే ఫొటో లేదని తిప్పి పంపించారు. సచివాలయానికి వెళితే వెంటనే నా ఫొటో అప్‌లోడ్ చేశారు. మళ్లీ సచివాలయానికి వెళ్లే పనిలేకుండా వలంటీర్‌తో ఆరోగ్య శ్రీ కార్డు ఇంటికి పంపిస్తామని చెప్పారు. వచ్చిన వెంటనే నా పని పూర్తి చేశారు. సచివాలయంలో చక్కగా సేవలు అందిస్తున్నారు.

– అరుగుల మహాలక్ష్మి, ఓల్డ్ కరాస,52వ వార్డు

సమస్యలు సకాలంలో పరిష్కారం



గతంలో ఏ పని కోసం అయినా మండల కార్యాలయాలకు వెళ్లాల్సివచ్చేంది. అది కూడా నాయకులు సిఫార్సు ఉన్నోళ్లకే పనులు జరిగేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రజల సమస్యలకు సకాలంలో పరిష్కారం లభిస్తోంది. అందుబాటులో ఉన్న సచివాలయంలోనే అన్ని సేవలు అందుతున్నాయి.

– బీ.ఎస్. కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్

భక్తులకు ఆహార పదార్థాల పంపిణీ



ఆహార పదార్థాలు పంపిణీ చేస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: వ్యాకులమాత పుణ్యక్షేత్రం వార్షికోత్సవాలకు జ్ఞానాపురం నుంచి కొత్త వలస వ్యాకులమాత క్షేత్రానికి పాదయాత్రగా వెళ్లిన భక్తులకు జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్ మెయిన్ రోడ్డులో ఆహార పదార్థాలు అందించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు ఆహార పదార్థాలు మజ్జిగ ప్యాకెట్లు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

'పది'లో మెరుగైన ఫలితాలే లక్ష్యం

- గురుకులాల జిల్లా కన్వీనర్ సత్యారావు



టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులతో అధ్యాపకులు

విశాఖ విద్య: గురుకులాల్లో ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఫలితాల సాధనే లక్ష్యంగా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఇటీవల నిర్వహించిన ఫార్మేటివ్ పరీక్షల్లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను సత్కరిస్తున్నారు. సింహాచలం బీసీ సంక్షేమ గురుకులంలో శనివారం విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. గురుకులాల జిల్లా కన్వీనర్ దాసరి సత్యారావు హాజరైన విద్యార్థులను ఉత్తేజపరిచారు. పబ్లిక్ పరీక్షలకు ప్రణాళికబద్ధంగా చదివితే విజయం తథ్యమన్నారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా చదువుకోవాలన్నారు. గురుకులాల్లో విద్యార్థులకు ప్రశాంత వాతావరణం కల్పించేలా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో ఉన్న మూడు బీసీ గురుకుల పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరీక్షలు దగ్గర పడుతున్నందున సబ్జెక్టు టీచర్లు తగిన శ్రద్ధ తీసుకొని విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. చదువులో రాణిస్తున్న విద్యార్థులను, ఇందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గోపాలపట్నం: మేహాద్రి గెడ్డ దరి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 23 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మృదుల ప్రియదర్శిని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష మార్చి 10న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందన్నారు. ఇంటర్‌లో చేరే వారికి అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థుల తల్లి దండ్రులు విద్యార్థి పాస్‌పోర్టు ఫొటో ఆధార్ జిరాక్స్ కాని తీసుకుని స్కూల్‌కు వస్తే ఎటువంటి రుసుము లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తామని తెలిపారు. సందేహాలు ఉంటే పూర్తి వివరాల కోసం 5వ తరగతిలో చేరే వారు 93984 69906, 77319 31386 నంబర్లలో, ఇంటర్‌లో చేరేవారు 97034 66990, 97038 84235 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి



యాంటీ లార్వా ఆపరేషన్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా నియంత్రణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజలు కూడా తగిన సహకారం అందించాలని 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురంలో శనివారం మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన యాంటీ లార్వాఆపరేషన్‌ను కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైడే–ఫ్రైడేపై ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పరుచుకుని ప్రతి శుక్రవారం, మంగళవారం ఇంట్లో అత్యవసరానికి కావాల్సిన నీటిని ఉంచుకుని, మిగిలిన నీటి పాత్రలను ఎండలో ఆరబెట్టాలని సూచించారు. తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చునని తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి అనారోగ్య సమస్య తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, కుమార్, ఎం.జయకుమార్, పి.రత్నం, దేవి, కె.సుధ పాల్గొన్నారు.

పెద్దలను గౌరవించడం మన బాధ్యత



తల్లిదండ్రులను సత్కరిస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య: తల్లిదండ్రులతో పాటు పెద్దవారిని గౌరవించడం విద్యార్థులు తమ బాధ్యతగా తీసుకోవాలని ఎన్‌ఏడీ శ్రీ చైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ జె. మహేష్ అన్నారు. 'ఫ్యామిలీ ఫెస్ట్' అనే కార్యక్రమం శనివారం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎంత ఉన్నత స్థానానికి ఎదిగనా జన్మనిచ్చిన తల్లిదండ్రులను మరువకూడదన్నారు. కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులకు వారి పిల్లలతో పాదపూజ చేయించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా శుభపరిణామం అని పలువురు తల్లిదండ్రులు కొనియాడారు. కార్యక్రమంలో ప్రైమరీ ఇన్‌చార్జి బి.సోనియా, డీన్ టి.సురేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'ఉక్కు ఆస్పత్రి'ని ప్రైవేటీకరించొద్దు



ఉక్కు అధికారులతో సమావేశమైన ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రి ప్రైవేటీకరణ చర్యలు విరమించుకోవాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. స్టీల్ సీఐటీయూ, మిత్రపక్షాల నాయకులు ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ఉక్కు ఆస్పత్రిపై గద్దల్లా వాలడానికి అనేక కార్పొరేట్ ఆస్పత్రులు సిద్ధంగా ఉన్నాయన్నారు. దీనిని సందర్శించడానికి వచ్చే ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యాలకు ఎర్ర తివాచీలతో స్వాగతం పలకడాన్ని ఆయన వ్యతిరేకించారు. ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ ఉక్కు ఉద్యోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాల్సిన యాజమాన్యం ఆస్పత్రిని ప్రైవేటుకు అప్పగించాలని చూస్తే అంగీకరించేది లేదన్నారు. ఆ ప్రతిపాదనలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అధ్యక్షుడు వై.టి.దాస్, సీనియర్ నాయకులు ఎస్. రామారావు, మిత్రపక్షాల నాయకులు శ్రీనివాస్, సన్యాసిరావు మాట్లాడుతూ తక్షణం మందులు కొరత తీర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆస్పత్రి ఇన్‌చార్జి విభాగాధిపతి డాక్టర్ సారంగికు వినతిపత్రం అందజేశారు.

ప్రైవేటీకరణ అవాస్తవం

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రి ప్రైవేటీకరణ అవాస్తవమని యాజమాన్యం తెలిపిందని స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు తెలిపారు. శనివారం ఐఎన్‌టీయూసీ బృందం ఆస్పత్రి యాజమాన్యం, హెచ్‌ఆర్ ఉన్నతాధికారులు జి. గాంధీ, కె. సంజీవరావులతో సమావేశమైన వివరాలను తెలియజేశారు. మీడియాలో వచ్చిన వార్తలు అవాస్తవమని, ఆస్పత్రిను ప్రైవేటుకు ఇచ్చే ఆలోచన లేదని తెలిపారు. ఆస్పత్రి ఉక్కు యాజమాన్యం ఆధ్వర్యంలో నడుస్తుందని, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఉన్నవారితోనే నడుపుతామని తెలిపారు. 17 మంది కాంట్రాక్టు ఉద్యోగుల తొలగింపు అవాస్తమని, ల్యాబ్‌లో కేవలం ముగ్గురిని మాత్రమే తీయడం జరిగిందన్నారు.

'ఆడారి' పెద్దమనసు



గణపతినగర్ కొండ ప్రాంతంలో పింఛన్ ఇస్తున్న సురేష్‌యాదవ్

సొంత నిధులతో పింఛన్ల పంపిణీ



పాతగోపాలపట్నంలో పింఛన్ అందిస్తున్న గుణిశెట్టి శ్రీనివాసరావు తదితరులు

గోపాలపట్నం: పలు సాంకేతిక కారణాలతో పింఛన్ మంజూరు కాని వారికి వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ భరోసాగా నిలుస్తున్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పలువురికి తన సొంత నిధులతో పింఛన్లు అందిస్తూ పెద్ద మనసు చాటుకుంటున్నారు. ప్రభుత్వ పింఛన్ మాదిరిగా రూ. 3వేల చొప్పున అందిస్తున్నారు.

జీవీఎంసీ 91వ వార్డు పాతగోపాలపట్నం, బాజీ జంక్షన్ ఎస్సీ కాలనీల్లో ఉప్పాటి హిమ, శైలజ, బర్ల జగదీష్, ఐక లక్ష్మి, గొందేశి కనకమ్మ, కటిక పార్వతి, కుమార్ లాల్, సురేష్, ఉత్తాడ కృష్ణ, మెలకపల్లి లక్ష్మిలకు రూ.3000 చొప్పున అందించారు. ఆ వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు తదితర నాయకులు శనివారం పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు సంతోషం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏవిధంగా ఆలోచిస్తున్నారో ఆడారి ఆనంద్ కుమార్ కూడా ఆయన బాటలో నడుస్తూ ప్రజలకు సేవ చేస్తున్నారని కొనియాడారు. అలాగే 92వ వార్డులో ఇందిరానగర్, ఆర్‌ఆర్‌వీ పురం, గణేష్‌నగర్, నరసింహనగర్ ప్రాంతాల్లో ఆ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు 8 మందికి రూ. 3000 చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొట్నూరి శంకరరావు, బల్లంకి వెంకటరావు, కడితి రాజు, తంబిరెడ్డి, పలివెల శంకరరావు, పి. రాము పాల్గొన్నారు.

59వ వార్డులో..

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు పరిధి గణపతినగర్ కొండ ప్రాంతంలోని ముసలయ్య అనే వృద్ధుడికి సాంకేతిక సమస్య కారణంగా పింఛన్ మంజూరు కాలేదు. ఇటీవల ఈ ప్రాంతంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆడారి ఆనంద్‌కుమార్‌కు పరిస్థితిని వివరించారు. దీంతో స్పందించిన ఆనంద్‌కుమార్ ప్రభుత్వ పింఛన్ మంజూరయ్యే వరకు తన సొంత నిధులతో ప్రతి నెల రూ. 3 వేల పింఛన్ ఇస్తానని మాట ఇచ్చారు. ఆ మాట ప్రకారం సమకూర్చిన నగదును ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్ శనివారం ముసలయ్యకు రూ. 3 వేలు అందజేశారు.

ఎన్నికల సిబ్బందితో ఈఆర్వో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

గాజువాక: గాజువాక నియోజకవర్గం ఎన్నికల సిబ్బందితో ఓటర్ల నమోదు అధికారి (ఈఆర్వో) డి.లక్ష్మారెడ్డి శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పోలింగ్ బూత్‌లవద్ద ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడైనా ఇబ్బందులున్నా, ఇబ్బందులు తలెత్తుతాయని అనిపించినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ ప్రసాదరావు, గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

జియ్యానికి అభినందన



డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌ను సత్కరిస్తున్న బీఎస్ కృష్ణ

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డుకు స్వచ్ఛతలో మొదటి స్థానం వచ్చిన సందర్భంగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌ను ఆయన కార్యాలయంలో శనివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన్ను శాలువతో సత్కరించారు. పార్కులు, రహదారుల అభివృద్ధి మొదటి స్థానంలో నిలిపిందని అభినందించారు.

యువకుడి ఆత్మహత్య



దేదీప్ (ఫైల్)

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు మద్రి పాలెం వుడాలేఅవుట్‌లో నివాసముంటున్న ధరిణికల దేదీప్(23) నివసిస్తున్న అపార్ట్‌మెంట్ 5వ అంతస్తు నుంచి శనివారందూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. మద్రిపాలెం వుడాలేఅవుట్ శివశివాని పాఠశాలకు వెళ్లే దారిలో ఓ అపార్ట్‌మెంట్‌లోని సొంత ఫ్లాట్‌లో కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. మృతుడి తండ్రి శ్రీనివాసరావు కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐలో ట్రెనింగ్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. కాగా శ్రీనివాసరావు అనారోగ్యంతో ఇబ్బంది పడడంతో శనివారం ఉదయం 10.30 గంటలకు ఆస్పత్రికి వెళ్లేందుకు బయలుదేరారు. ద్విచక్రవాహనం తీసిన దేదీప్ వాషరూమ్‌కు వెళ్లి వస్తానని చెప్పి పైకి వెళ్లి దూకేశాడు. వెంటనే 108 వాహనం ద్వారా ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు దేదీప్ బీటెక్ పూర్తి చేసి గేట్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ యాదవ్ కేసు దర్యాప్తు చేపట్టారు.

1087వ రోజుకు ఉక్కు దీక్షలు



మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం; విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం కార్మిక వర్గం చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1087వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగ కార్మికులు పాల్గొని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.